ఒంటరి జీవితానికి
ఆలంబనగా
తోడు ఆశించిన
అతడి కోరిక
ఫలించిందా?

# తోడొకరుండిన

అరేటి నాగమణి కథ

"అంకుల్! మీకు ఉత్తరం వచ్చింది" పక్కింటి పిల్లాడు ఉత్తరం అందించి రివ్వున పరుగెత్తాడు.

ఉత్తరం మీది దస్తూరిని చూస్తూనే చలపతి గాఢంగా నిట్టూర్చి చదవకుండానే టేబుల్ మీద పడేశాడు.

బట్టలు మార్చుకుని, మొహం కడుక్కుని వచ్చేసరికి సుగుణమ్మ వేడివేడి కాఫీ తెచ్చి ఇచ్చింది.

"ఏదో ఉత్తరం వచ్చినట్టుంది" అంది టేబుల్ మీది ఉత్తరాన్ని చూస్తూ.

"అవునండీ! నాన్నగారి దగ్గరినుండి"

"ఇంకా చదివినట్టు లేదే!" అంది చింపకుండా వున్న కవరువంక చూస్తూ.

"చదవడానికి అందులో కొత్త విషయం ఏముంటుందండి. ఏదో పెళ్లిచూపుల గొడవే అయ్యుంటుంది!" అన్నాడు కాఫీ తాగడం పూర్తిచేస్తూ

"చక్కగా పెళ్లి చేసుకోమని నెలకోసారి ఓ ఉత్తరం రాస్తుంటే నువ్విలా 'గొడవ' అంటూ అనడం నాకేం బావులేదబ్బాయ్. ఎన్నాళ్లిలా వుంటావ్? ముప్పై ఏళ్లు దాటుతున్నాయా? అంది మందలిస్తున్నట్లుగా.

"పెళ్లి చేసుకోవడం దేనికండి? అనవసరపు చిక్కులు కొని తెచ్చుకోవడం కాకపోతే.. హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నాను. హోటల్ తిండి తినే దురదృష్టం లేకుండా తల్లిలా మీరు వంట చేసి పెడుతున్నారు. ఎప్పుడైనా ఉబుసుపోకపోతే సినిమాలు మరీ బోరైతే ఏ స్నేహితులతోనో మందు పార్టీలు.. ఇంకేం కావాలి" అన్నాడు నవ్వుతూ.

సుగుణమ్మ జాలిగా చూస్తూ



నవ్వేసింది.

"మగవాడికి కావాల్సింది మరొకటుంటుందని అది వలపతి డబ్బుతో కొనుక్కోగలడని... కొనుక్కుంటున్నాడని ఆమెకు తెలుసు. రెండుమూడు పార్లు గమనించింది కూడా. కానీ అన్నీ కొనుక్కోవడమేనా జీవితం?

"కేవలం తిండికోసమో లేక శారీరక

అవసరాలకోసమేనా పెళ్లంటే? నీ అభిప్రాయం సరైందికాదుబాబూ! హాస్టల్ వాతావరణంలో పెరిగినందుకేమో? నీకు ఆత్మీయత, అనుబంధం, ప్రేమ వీటి అర్థం, విలువ సరిగ్గా తెలీకుండా పోయాయి. అది నీ తప్పుకాదు. తల్లి ప్రేమ తెలీని నిన్ను మీ నాన్నా హాస్టల్‌లో వేసి చదివించడం ఓ కారణం కావచ్చు. కానీ ఒక మనిషి జీవితంలో ఒకరిని ప్రేమించడమో, లేక ఒకరిచేత ప్రేమించబడడమో జరగకపోతే ఆ జీవితానికి అర్థం లేనట్టే. అర్థం లేని జీవితం ఎంత నిస్సారంగా వుంటుందో నీకు ఇప్పుడు తెలీకపోవచ్చు. కాని... ముందు ముందు ఏదో ఒకరోజు తెలిసినప్పుడు, కాలంతో కరిగిపోయిన ఈ రోజులు వెనక్కి తిరిగిరావుకదా!''

''నా మాట వినుబాబూ! పెద్దాయన పదేపదే అలా ఉత్తరాలు రాస్తుంటే నువ్విలా నిర్లక్ష్యంగా వుండడం, ఆయన ఆరాటాన్ని, ఆత్రుతను అర్థం చేసుకోకపోవడం... ఏం బావులేదు. ఆయనకు మాత్రం ఎవరున్నారూ? నువ్వుతప్ప! నువ్వొక ఇంటివాడవైతే ఆయనకు ఒంటరితనం పోతుంది. ఇంట్లోకి ఆడదిక్కు వస్తుంది. వట్టింట్లో పిల్లా పాపలతో హాయిగా వుంటూ, నీ వంశాంకురాలతో ఆయన శేషజీవితం హాయిగాగడిచిపోతుంది''

ఆమె అంతలా చెబుతుంటే ఆశ్చర్యపోయాడు చలపతి. వింతగా చూశాడామెవైపు.

''నేనిలా చెప్పడం నీకు ఆశ్చర్యంగా వుండొచ్చు. అతిచనువు తీసుకుంటున్నానని కోపంగా వుండొచ్చు. కాని... ఎవరూ లేనిదాన్ని. ఆ మధ్య మీ నాన్నగారు ఇక్కడికి వచ్చినప్పుడు, ఆయన బాధంతా నీ గురించేనని అర్థం చేసుకున్నాను కాబట్టి చెబుతున్నాను''

''బలవంతం ఏం లేదుకదా! నీకు నచ్చిన అమ్మాయినే చేసుకో... నిన్ను పెళ్లికి ఒప్పిస్తానని మీ నాన్నకు నేను మాటిచ్చాను. ఏదో... పెద్దదాన్ని... తల్లిలాంటిదాన్నని నువ్వే అన్నావ్. కాబట్టి నామీద ఏమాత్రం గౌరవం, అభిమానం వున్నా ఈసారికి వెళ్లి అమ్మాయిని చూసిరా'' అంది.

చలపతి చిన్నగా నవ్వేస్తూ ''సరే వెళ్తాలెండి'' అన్నాడు తప్పదన్నట్లు.

''అలా కాదు! ముందు నువ్వా ఉత్తరం చదువు. ఎప్పుడు రమ్మని రాశారో చూడు'' అంది.

చలపతి అయిష్టంగానే ఉత్తరంచదివాడు.

''అమ్మాయి చాలా బావుంది. నీకు నచ్చుతుందనే నా నమ్మకం. మన ఊరే. నువ్వు వచ్చాక వాళ్లకు కబురుచేస్తాను. వీలైనంత త్వరలో రాగలవు. వచ్చే నెలలో మంచి ముహూర్తాలున్నాయి'' ఉత్తరం చదివి ఆమెవంక తిరిగి ఏదో అనబోయాడు.

''అయితే రేపే బయలుదేరు'' అందామె.

''రేపా?''

''మంచి పనికి ఆలస్యం ఎందుకు బాబూ. ఆలస్యం చేస్తే అమృతంకూడా విషం అవుతుందట'' అంటూ చలపతిని ఒప్పించి మరీ బయలుదేరదీసింది.

చలపతికి ఇష్టం లేకున్నా ఆవిడ తపనం తగా బలవంతం చేయడం నచ్చలేదు.

ఆమధ్య తండ్రి తనను చూడ్డానికి వచ్చినప్పుడు హఠాత్తుగా సుస్తీ చేసింది. సరిగ్గా

అప్పుడే తనకు ఆఫీసులో ఇన్స్పెక్షన్. సెలవు పెట్టలేకపోయాడు. ఆ సమయంలో తండ్రిని కనిపెట్టుకుని ఆయన బాగోగులు చూడ్డంవల్ల తాను చాలా నిశ్చింతగా సెలవు పెట్టుకోకుండా ఆఫీసుకు వెళ్లి రాగలిగాడు. అప్పుడే తన పెళ్లి గురించి నాన్నగారు ఆవిడ ముందు బాధపడి వుంటారు. అందుకే కాబోలు ఆవిడ ఇంతలా తనను ఒప్పించి మరీ పంపిస్తోంది.

రైల్లో కూర్చున్నాడన్న మాటేకాని, వల పతికి వెళ్లడం అసలు ఇష్టంలేదు. పెళ్లిచూపు లంటే అసలు ఇష్టంలేదు. అంతకు క్రితం ఓ నాలుగైదు చూశాడలాగే. తండ్రి బాధప డలేక నచ్చలేదని చెప్పాడు.


మరో రెండు సంబంధాలైతే, తండ్రి వాళ్లను అమ్మాయితో సహా హైదరాబాద్‌కే తీసుకువచ్చాడు, ఉత్తరం రాస్తే తాను వెళ్లడంలేదని.

తనకు అమ్మాయి నచ్చకపోవడానికి కార ణం అమ్మాయి అందంగా లేకపోవడంకాని, కట్నం పట్టింపుగాని కావు. తనకసలు పెళ్లంటేనే ఇష్టంలేదు.

వెధవ బాదరబందీ ఎవరుపడతారు. హాయిగా స్వేచ్ఛగా ఏ బరువుబాధ్యతలు లేకుండా వుండడమే తనకు కావాలి.

ఆకలైనప్పుడు హోటల్‌కెళ్లి భోజనం చేసినట్టు, తన శరీరం ఎదురుతిరిగినప్పుడు అవసరానికి డబ్బు పారేసి ఎన్నోసార్లు అమ్మా యిల దగ్గరకెళ్లాడు. భార్యతో పంచుకునే శారీరక సుఖం కొనుక్కోగలడు. తాగాలనిపిం చినప్పుడు స్నేహితులతో మందు పార్టీలు చేసుకుంటాడు. తండ్రికి తన జీతంతో అవసరంలేదు. దాదాపు మూడువేలవరకే జీతం వస్తుంది. తన ఖర్చులకు పోనూ చాలావరకు మిగులుతుంది. ఇక పెళ్లి, పెళ్లాం అనవసరం అనిపిస్తుంది. ముప్పై ఏళ్లు నిండుతున్న తనకు జీవితంలో ఎలాంటి అసంతృప్తి కనిపించడంలేదు.

○ ● ○



ఉత్తరం అందిన మర్నాడే చలపతి రాక రఘురామయ్యకు సంతోషం కలిగించడమే కాదు. శుభసూచకంగా అన్పించింది.

ఇంకెంత ఇంట్లో తానిక ఒంటరిగా వుండనక్కరలేదు. గుప్పెడు మెతుకులకోసం చేయి కాల్చుకోనక్కరలేదు. కబుర్లుచెప్పుకోవడానికి, రోజూ రామాలయం వీధి చెట్టుకింద స్నేహితులెవరైనా వస్తారని ఎదురుచూడక్కర్లేదు. ఠీవిగా కాలుమీద కాలు వేసుకుని ఊయల బల్లమీద కూర్చుంటే అన్నిపన్లు జరిగిపోతాయి.

ఊహలతో రఘురామయ్య ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

అమ్మాయివాళ్లకు తాము వస్తున్నట్లుగా కబురుచేశాడు. చలపతికంటెముందుగా ఎంతో ఉత్సాహంగా బయలుదేరాడు.

అమ్మాయిపేరు అరుణ. పెద్ద అందగత్తె కాకపోయినా మొహంలో చక్కటి కళ, కనుముక్కుతీరుగా వున్నాయ్. ఇంటర్ పాసయింది. కట్నం, లాంఛనాలుకూడా తృప్తికరంగానే ఇస్తామని చెప్పారు. రఘురామయ్యకు అన్ని విధాలా మంచి సంబంధం అన్న సంతోషంతోపాటు ఓ ప్రక్క చలపతికీ సంబంధం నచ్చుతుందో లేదోనన్న దిగులు వేసింది.

చలపతి అక్కడేం మాట్లాడలేదు. ఆత్రుతగా కొడుకు మొహంలోకి చూస్తున్న ఆయనకు, చలపతి మొహంలో ఎలాంటి భావం కన్పించకపోవడంతో నిరాశపడిపోయాడు.

అబ్బాయి అంగీకారం కనుక్కోండి బావగారూ! వీలైతే వచ్చేనెల్లోనే మంచి ముహూర్తాలు వున్నాయ్ అన్నాడు అరుణ తండ్రి.

రఘురామయ్య తల ఊపాడేగాని, చలపతి వాలకం చూస్తే వచ్చే నెలలో కాదుగదా, వచ్చే సంవత్సరానికైనా, ఆ మంచి ముహూర్తం వస్తుందా అన్పిస్తుంది.

ఆ సాయంత్రం వరకు కూడా చలపతి ఏం మాట్లాడకపోవడంతో రఘురామయ్య ఆశ చంపేసుకున్నాడు.

మర్నాడు ఉదయాన్నే చలపతి తిరుగు ప్రయాణమయ్యాడు. బయలుదేరే ముందు "వెళ్లొస్తా నాన్నా!" అంటూ తండ్రివంక చూశారు. ఆయన మొహంలో ఏదో తెలుసుకోవాలన్న ఆత్రుత, ఆరాటం చూసి నవ్వుకున్నాడు చలపతి.

"రేయ్ చలపాయ్! ఎందుకురా ఆ ముసలి ప్రాణాన్ని అంత బాధపెడతావ్? అమ్మాయి అన్నివిధాలా నీకు నచ్చింది. కట్నం రేటు బానే వుంది. అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు అలాంటప్పుడు ఆయన మనసును సంతోషపెట్టడంవల్ల నువ్వే ఇంటివాడవవుతావుకదా? మనసు నిలదీసింది చలపతిని.

"మంచి ముహూర్తంచూసి నిర్ణయించాక ఉత్తరం రాయండి నాన్నా! సెలవుపెట్టుకుని వచ్చేస్తాను!" అన్నాడతను బయలుదేరేముందు.

రఘురామయ్య సంతోషంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. చలపతి ఒప్పుకుంటాడని ఊహించని అతను, చలపతి ఒప్పుకోవడంతో సంతోషపడిపోయాడు.

తిరిగి వచ్చిన చలపతిద్వారా విషయం విన్న సుగుణమ్మకూడా సంతోషపడిపోయిం

ది.

ఆమెకు 'నా' అనేవాళ్లెవరూ లేరు. పిల్లలుకూడా లేకపోవడంతో భర్తపోయాక ఒంటరి బ్రతుకైపోయిందామెది. చలపతి పేయింగ్ గెస్ట్‌గా ఆవిడ ఇంట్లో మూడేళ్లుగా వుంటున్నాడు. ఈ మూడేళ్లలో ఆమె అంతగా సంతోషపడ్డం చూడని చలపతి ఆశ్చర్యపోయాడు.

నాకు చాలా సంతోషంగా వుంది చలపతి! నువ్వో ఇంటివాడవైతే నాకు ఒక తోడు దొరుకుతుంది. ఎవరూ లేరనుకున్న నేను, ఈ జీవితపు చరమాంకంలో ఒక తోడు దొరకడం నా అదృష్టం బాబూ... అంది కళ్లనీళ్లు నింపుకుంటూ.

రఘురామయ్య ముహూర్తాలు నిర్ణయింపగానే ఏకంగా చలపతి దగ్గరకు వచ్చేశాడు.

పెళ్లి మరో పదిహేనురోజులుందనగా రఘురామయ్య పెళ్లికి కావాల్సిన వస్తువులు, నగలు, బట్టలు కొనడంతోపాటు చలపతిని వెంట తీసుకుపోవాలనుకున్నాడు.

చలపతి పెళ్లి చాలా ఆడంబరంగా చేశాడు రఘురామయ్య. ఊళ్లో వాళ్లంతా చాలా గొప్పగా మరింత వింతగా చెప్పుకున్నారు.

కారణం సుగుణమ్మ.

పెళ్లి మొత్తంలో ఆవిడ ఆ ఇంటికి పెద్దదిక్కుగా నిలబడి ప్రతిపనిని చాలా సమర్ధవంతంగా నిర్వహించింది సుగుణమ్మ.

ఆడదిక్కులేని ఆ ఇంట్లో చాలా రోజుల తర్వాత ఆడదిక్కున్న ఇల్లు ఎలా వుంటుందో రఘురామయ్యతోపాటు చలపతికి అర్థం అయింది.

అంతగా బంధువులులేని రఘురామయ్య చలపతి పెళ్లికి ముహూర్తం నిర్ణయింపగానే చాలా కంగారుపడిపోయాడు. చేతినిండా డబ్బుతీసుకుని ముందుగా చలపతి దగ్గరకు వెళ్లాడు.

## ఢిల్లీ పిల్లి



"పిల్లి ఎలా అరుస్తుందిరా రామూ"

"మ్యావ్... మ్యావ్...

"ఢిల్లీలో అయితే ఎలా అరుస్తుందిరా"

. . . . . . . .

"ఆదేమిట్రా... ఏమీ మాట్లాడకుండా నోరు ఆడిస్తావ్"

"మరి ఢిల్లీలో పిల్లి అరిస్తే ఇక్కడికి వినబడదు కదండీ".

-కవితా వర్మ (గుంటూరు)

పెళ్లికూతురుకు కావాల్సిన బట్టలు, నగలు తీసుకోవడానికి సుగుణమ్మను తోడు తీసుకువెళ్లారు తండ్రికొడుకులు.

వాళ్లతోపాటే ఊరికి కూడా వచ్చేసింది సుగుణమ్మ.

వారం రోజుల్లో ఇంటికి సున్నాలు వేయించడంతోపాటు, పెళ్లి పనులన్నీ చాలా శ్రద్ధగా, ఎలాంటి లోపం లేకుండా చాలా సమర్ధవంతంగా నిర్వహించింది. మూడేళ్లుగా చలపతి ఆవిడింట్లోనే వుంటున్న విషయాన్ని రఘురామయ్యద్వారా ఊళ్లోవాళ్లందరూ ఆవిడంటే ఎంతో గౌరవంగా అభిమానంగా చూశారు. ఆవిడ కలుపుగోలుతనం అందర్నీ ఆకుట్టుకునేలా చేసింది.

ఏ ఒక్క విషయంలోకూడా ఎలాంటి లోటుపాట్లు జరక్కుండా పెళ్లి సవ్యంగా జరిగిపోయింది.

మరో వారానికి చలపతి భార్యతో బయలుదేరారు. అరుణ మరో వారానికి సుగుణమ్మతో కలిసి వస్తాననడంతో చలపతి ఒక్కడే బయలుదేరాడు.

బస్సుస్టాండువరకు వెంట వచ్చిన రఘురామయ్య చలపతితో ఏదో చెప్పాలనుకుంటూ ఆగిపోవడం గమనించిన చలపతి అడిగాడు.

నాన్నా! నాతో ఏదో చెప్పాలనకుంటూ... సంశయిస్తున్నారు అన్నాడు.

''వచ్చేవారం అమ్మాయిని తీసుకెళ్తావుకదూ చలం!''

''ఆ...'' అంటూ తండ్రివంక చూస్తూ... ''పోనీ, మరో వారం ఇక్కడే...'' తండ్రి ఒంటరిగా వుంటాడన్న ఆలోచన రావడంతో అడిగాడు.

''అహా... అలాక్కాదు. నీకు ఇబ్బంది అవుతుందేమో భోజనానికి...''

తండ్రి చెప్పాలనుకుంటుందేమిటో అర్ధంకాలేదు.

బస్సు రావడంతో చలపతి వెళ్లిపోయాడు. అతను వెళ్లి మూడురోజులకు రఘురామయ్య దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.

''చలం! మీ అమ్మ పోయాక, నా జీవితంలో ఈ ఇంట్లోకి ఎవరూ రాలేదు. దాదాపు ఇరవై ఏళ్ల ఈ లంకంత ఇంట్లో నేను ఒక్కడినే గడిపాను. ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్న నిన్ను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక, నాకెంత జబ్బుచేసినా, ఊళ్లోవాళ్ల సహాయం తీసుకున్నాను. నేను ఒంటరివాణ్ణని... దిక్కులేనివాణ్ణన్నజాలితో...

కానీ జాలితో, సానుభూతితోకాకుండా ఓ బాధ్యతగా చేయడం సుగుణమ్మలో చూశాను. ఆవిడకూడా ఒంటరిదే. పశ్చిమానికి వెళ్లిపోతున్న మా జీవితాలు ఒకరికొకరం తోడుగా వుండాలనే నిర్ణయానికి వచ్చాం. ఆమెకు బరువుబాధ్యతలు లేవు. నీ పెళ్లి ఒక్కటే నా బాధ్యతగా మిగిలిపోయింది. ఆ బాధ్యత తీరిపోయింది. నీ భార్య, పిల్లలతో నీ జీవితంలో ఒక తోడు ఏర్పడిపోయింది చలం! నేను మీ మధ్యలో వుండి మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేను. అలా అని నిన్ను, అమ్మాయిని ఇక్కడ వుండమని అనలేను.

సుగుణ, నేను కలసి వుండాలనుకుంటున్నాము. మా మధ్య ఒకరికి ఒకరు తోడనే భావన, స్నేహం తప్ప మరో ఆవసరానికి తావులేని వయసు మాది. అర్ధం చేసుకుం

టావుకదూ! నేను, సుగుణ అన్నవరం వెళ్తున్నాం. అరుణ పుట్టింట్లో వుంది. వీలైతే నువ్వు వచ్చి, అరుణను తీసుకుని వచ్చే శుక్రవారంనాటికి అన్నవరం రాగలవు. మీ అమ్మను చూడ్డానికి అని అంటే సెలవు దొరకదేమో. పోనీ... నా స్నేహితురాలిని చూడ్డానికి... అని రాయవా!

రఘురామయ్య

○ ● ○

తండ్రి ఉత్తరాన్ని చదివిన చలపతి కళ్లనిండా నీళ్లు నిండాయి. ముప్ఫయ్ ఏళ్లుగా ఒంటరితనం అలవాటైన తను, పెళ్లయి నెలకాకముందే అరుణను వదిలి వుండడం ఎంతో బాధగా వుంది. సుగుణమ్మ లేకపోవడంతో భోజనానికి ఇబ్బందిపడిపోతున్నాడు. మువ్వటగా మూడు రాత్రులు గడపడంతో అరుణే సర్వస్వం అనిపిస్తోంది తనకు... కాని తండ్రి ఇన్నేళ్లుగా ఆ పల్లెటూళ్లో ఒక్కడు ఎంత అవస్థ పడ్డాడో... ఇప్పటికి కూడా! ఆయన తన బరువు బాధ్యత తీరాకే తానొక నిర్ణయం, తన జీవన సంధ్యలో తోడుగా నడిచేందుకు సుగుణమ్మను ఎన్నుకున్నాడుతప్ప. ఈ వయసులో శారీరక సుఖంకోసం మాత్రం కాదు. ఈ రోజుల్లో ఏ కొడుకు, కోడలు వర్ధాప్యంలో వుండే అత్తమామలను ఆదరిస్తున్నారు? ఆదరించడానికి అభిమానం కావాలి. అభిమానం వున్నా, ఓపిక, తీరిక వుండాలి. కన్నకొడుకుగా తానే ఇన్నిరోజులు తండ్రి గురించి ఆలోచించలేదు. అరుణ ఆలోచిస్తుందా?

"ఎందుకు ఆలోచించను? ఊళ్లో వాళ్లు తలోరకంగా అనుకుంటున్నారు" అంది అరుణ నిష్టూరంగా.

"ఎవరో ఏదో అనుకోవడం కాదు అరుణా! నాన్న నిర్ణయం నాకు నచ్చింది. నా బాధ్యత తీర్చుతమేకాదు. నాకు బరువుగా మారకూడదనుకున్నాడాయన. ఆవిడ చాలా మంచిది. నాన్నను బాగా చూసుకుంటుందనే నా నమ్మకం"

"అవును ఈ మాత్రందానికి అన్నవరం వెళ్లి పెళ్లి చేసుకోవాలని వుందా... ఈ వయసులో"

"వీలాంటి వారుంటారని... ప్రపంచంలో చాలామంది వీలాంటి వాలాంటి వారుంటారని తెలిసే ఆవిడ ఓ వంటమనిషిగా కాక ఆ ఇంట్లో ఓ హక్కుగా, అధికారంగా స్థానం పొందాలనుకుంటుంది. అందులో తప్పేం లేదు. సరే నేను అన్నవరం వెళ్తున్నాను. రాదలచుకుంటే నువ్వురా... వాళ్లను అభినందించడమే మనం చేయదగ్గ మంచి పని" అన్నాడు చలపతి.

తమ పెళ్లికి కొడుకు కోడలు రావడం, రఘురామయ్య మనసు తృప్తిపడిపోయింది. తానేం తప్పుచేయడంలేదన్న భావంతో.

○ ● ○

